క్లుప్తంగా

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు పక్కా గృహాలు

కల్లూరురూరల్: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పేదలకు పక్కా గృహాలు మంజూరు అవుతాయని ఎమ్మెల్యే మట్టా రాగమయి స్పష్టం చేశారు. పుల్లయ్య బంజరు గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలతో పాటు ఇంకా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సాంబశివుడు, ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యోగా డేలో పాల్గొనండి

మధిర: ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా డేలో మధిరలోని ప్రముఖులు పాల్గొనాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు కోరారు. శుక్రవారం గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ నరసింహారావు, మాజీ ఎంపీపీ ఎర్రగుంట లక్ష్మి రమేష్, మాజీ కౌన్సిలర్ కాండ్ర తిరుమలరావు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి పెరుగు రమేష్ కుమార్, పాస్టర్ల సంఘం రాష్ట్ర నాయకులు బండి అప్పారావు, బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి తదితరులను కలిసి యోగా గురించి వివరించారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్పెక్టర్ ఆర్ గణేష్ బాబు, స్థానిక వైద్యులు వెంకట్ లాల్, ఆయుష్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకుడు కందుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు..

ముదిగొండ: యువత డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య యాత్ర శుక్రవారం ముదిగొండకు చేరుకున్న సందర్భంగా ముదిగొండ అమరవీరుల స్మారక స్తూపం వద్ద మెట్టెల సతీష్ అధ్యక్షతన సభ ఏర్పాటు చేయగా.. ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగులు పెరుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రదయాత్ర డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు బట్టు పురుషోత్తం, వేల్పుల భద్రయ్య, మండల అధ్యక్షులు బట్టు రాజు, రవి, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

చింతకాని: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొండా గోపి తెలిపారు. శుక్రవారం మండలంలోని మత్కేపల్లి గ్రామంలో మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి మంగయ్య, ఉపాధ్యక్షుడు కృష్ణ, హేమంత్, బూత్ అధ్యక్షుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అసంతృప్తిగా పాలన

కారేపల్లి: దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన అసంతృప్తిగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు పి.సోమయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని మాణిక్యారం గ్రామంలో అమరజీవి రేపాకుల లాలయ్య స్మారక స్థూపాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతుంటే.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని తెలిపారు.

అనంతరం మాణిక్యారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు నాగేశ్వరరావు, నరేంద్ర, రామారావు, ఉమావతి, నాగేశ్వరరావు, రామచంద్రయ్య, కొండయ్య, సీతా రాములు తదితరులు పాల్గొన్నారు.

14నుంచి రాజకీయ శిక్షణా తరగతులు

తల్లాడ: మండలంలోని కున్నవల్లిగ్రామంలో ఈనెల 14నుంచి 16వరకు నిర్వహించే సత్తుపల్లి డివిజన్‌స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పులి కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణా తరగతులకు సత్తుపల్లి డివిజన్ నుంచి 250మంది పార్టీ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్‌కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, మోహన్ రావు, కృష్ణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఉత్తీర్ణత

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు ఇటీవల జరిగిన బీ, సీ సర్టిఫికెట్ల పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. సీ సర్టిఫికెట్ విభాగంలో కళాశాలకు చెందిన ఎం.ఆదర్శ్ ఎ-గ్రేడ్ సాధించాడు. బీ సర్టిఫికెట్ విభాగంలో సత్తిబాబు ఎ-గ్రేడ్ సాధించాడు. దీంతో వారికి కమాండింగ్ ఆఫీసర్ ఎస్‌కె భద్ర శుక్రవారం సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి, అధ్యాపకులు అభినందించారు.

సీతారామతో సస్యశ్యామలం

- కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని 12,500 ఎకరాలకు సాగునీరు
- త్వరలో భూ సేకరణ
- కాలువ నిర్మాణానికి మొదటి దశలో రూ.90 కోట్లు మంజూరు


కప్పలబంధం వద్ద సాగర్ కెనాల్ హెడ్ రెగ్యులేటరీ

కల్లూరురూరల్: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని 20 గ్రామాల పరిధిలో 12,500 ఎకరాల ఎగువ భూములకు సాగునీరు అందించేందుకు జల వనరుల శాఖ అధికారులు డీపీఆర్ రూపొందించారు. ఈ మేరకు కాల్వల నిర్మాణానికి త్వరలో భూ సేకరణ చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. అందుకోసం ప్రభుత్వం రూ.90 కోట్లు మంజూరు చేసింది.

రెండు మండలాలకు సాగునీరు పుష్కలం..

ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సీతారామ సాగర్ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్-1 ద్వారా సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, పెనుబల్లి మండలాలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. ఈ కెనాల్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చండ్రుగొండ మండలం ఎర్రగుంట గ్రామం వద్ద సీతారామ ప్రాజెక్టు కెనాల్‌పై 741 కిలోమీటర్ వద్ద నుంచి 0, కిలోమీటర్ నుంచి 24వ కిలోమీటర్ వరకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మించనున్నారు. ఈ కాల్వల నిర్మాణం కోసం ఇప్పటికే 20 గ్రామాల్లో భూ సేకరణ కోసం గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి అనుమతి తీసుకున్నారు.

కెనాల్ కోసం 824ఎకరాల భూమి సేకరణ..

చండ్రుగొండ మండలం ఎర్రగుంట డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నుంచి కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని 20 గ్రామాలకు కాలువ నిర్మాణానికై 824 ఎకరాల భూమిని సేకరించనున్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.90 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ధర కంటే రెండు రేట్లు ఎక్కువగా భూములకు చెల్లించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో గ్రామసభ నిర్వహించినందున కాలువ నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం వల్ల భూ సేకరణ సులభంగా చేసేందుకు అధికారులకు అవకాశం కలిగింది.

కొత్తగా 12,500 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ..

సీతారామ సాగర్ ప్రాజెక్టు జలాల వల్ల కల్లూరు మండలంలోని ఏడు గ్రామాలు, పెనుబల్లి మండలాల్లోని పన్నెండు గ్రామాల్లోని సుమారు 12,500 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఎర్రగుంట గ్రామంలోని సీతారామ కెనాల్ ప్రాజెక్టు 74.71 కిలో మీటర్ నుంచి 12వ ప్యాకేజీ ఎల్ఆర్ఎం ద్వారా డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు నీరు విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

తప్పనున్న లిఫ్టుల బాధలు..

సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందినట్లయితే ఈ ప్రాంత రైతులకు సాగర్ కెనాల్ ద్వారా నిర్మించిన లిఫ్ట్‌ల బాధలు తప్పనున్నాయి. కల్లూరు మండలంలోని బత్తులపల్లి లిఫ్ట్ ద్వారా 1,100 ఎకరాలు, కప్పలబంధం లిఫ్ట్ ద్వారా 800 ఎకరాలు, గోకవరం, కొర్లగూడెం, నారాయణపురం లిఫ్ట్ ద్వారా 750 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మండలంలోని తాళ్లపెంట లిఫ్ట్ ద్వారా 1,300 ఎకరాలు, పెనుబల్లి, అడవిమల్లెల తదితర గ్రామాలకు ప్రస్తుతం సాగర్ కెనాల్ లిఫ్ట్ ద్వారా సాగునీరు అందిస్తున్నారు. సీతారామ జలాల రాకతో రైతులకు ఇక లిఫ్ట్ ఇరిగేషన్‌తో అంతగా అవసరం ఉండదు.

సీతారామతో సాగునీరు పుష్కలం..



రాష్ట్ర ప్రభుత్వం సీతారామ సాగర్ జలాలను ఎగువ ప్రాంత భూములను సస్యశ్యామలం చేసేందుకు ఈ ప్రాంతానికి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా అందించేందుకు కృషి చేయడం అభినందనీయం. దీంతో ఈ ప్రాంత భూములు రెండు పంటలు పండుతాయి. దీనికై కృషి చేస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు.

– కత్తి కృష్ణారెడ్డి, రైతు, బత్తుపల్లి

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి


వైరాలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: సమస్యలు తలెత్తకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లి పోలీస్ స్టేషన్ గంధం టవర్స్ ప్రాంతాల్లో డ్రెయినేజీ కాల్వలను పరిశీలించి, మురుగు నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చింతా వేణుకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, పణితి శ్రీను, అశోక్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

ఏన్కూరు: మండల పరిధిలోని భగవాన్‌నాయక్ తండలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పంపిణీ చేసి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీఓ జీవీఎస్ నారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మతల్లి ఆలయ శిఖర ప్రతిష్ఠ


గోపుర శిఖర ప్రతిష్ఠ గావిస్తున్న అర్చకుడు

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లి గోపుర శిఖర ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. జేష్ఠ మాస శుద్ధ ఏకాదశి ఉదయం 9:27 గంటలకు చిత్తా నక్షత్రయుక్త కర్కాటక లగ్న సుముహూర్తంలో వేదమంత్రోచ్చరణాల నడుమ గోపుర ప్రతిష్ఠాపన జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కంచెల సతీష్ శర్మ మరియు అర్చక బృందం ఉదయం గణపతి పూజతో ప్రారంభించి గోపుర ప్రతిష్ఠతో పాటు కుంభాభిషేకం, పూర్ణాహుతి గావించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అమ్మవారి యంత్రములు అందజేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

మదన్‌లాల్ సేవలు మరువలేనివి

వైరా: వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ చేసిన సేవలు మరువలేనవని తెలంగాణ రాష్ట్ర మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం వైరాలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో నిర్వహించిన మదన్‌లాల్ సంతాప సభలో ఆయనతో పాటు పలువురు నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైరా బస్టాండ్ సెంటర్‌లో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు భూక్యా వీరభద్రం, బాణాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు కృష్ణార్జునరావు, సమత, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, శ్రీనివాసరావు, సునీత ప్రసాద్, పవిత్ర, నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవి, కారుకొండబోసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంజనీరింగ్ విద్యార్థుల శిక్షణ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండు, మూడు, నాల్గో సంవత్సరం చదువుతున్న సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు విజయవాడ క్యాంటర్ క్యాడ్ ఆధ్వర్యంలో మే 26వ తేదీ నుంచి 11 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులకు కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ విశ్లేషణా విభాగంలో ఆధునిక టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ ద్వారా నమూనాలను గీచే విధానాన్ని నేర్పించారు. ప్రతిభను కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి.రామచంద్రరావు, క్యాంటర్ క్యాడ్ మేనేజర్ కె.నాగు, సివిల్ విభాగాధిపతి డాక్టర్ ఎల్.సాయిఇంద్రసేనారెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


నియామక పత్రం అందిస్తున్న దుర్గాప్రసాద్

వైరారూరల్: ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గరికపాడు, దాచాపురం గ్రామాల్లో మండలాధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామశాఖ అధ్యక్షులను నియమించి నియామక పత్రాలు అందించారు. జైబాపు జైభీమ్ జై సంవిదాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి సత్యనారాయణ, పుల్లయ్య, రత్నం, బుజ్జి, అశోక్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల దిశగా కళాశాల

సత్తుపల్లిరూరల్: నూతన ఆవిష్కరణల దిశగా గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఏఐసీటీఈ(అఖిలభారత సాంకేతిక విద్యామండలి), వైయూకేటీఐ(ప్రొడక్టైజేషన్ ఫెలోషిప్, యుక్తి ఇన్నోవేషన్) ఛాలెంజ్-2025లో పాల్గొనేందుకు 1.84 లక్షల ఐడియాస్ ఇన్నోవేషన్స్, స్టేటస్ సమర్పించారు. ఇందులో కళాశాలకు చెందిన మాదాసు అభినయ్, ఎల్.సన్నిలు ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్షువల్ అభినందించారు.

కారేపల్లి రెండో ఎస్సైగా కోడెత్రాచు


కోడెత్రాచు

కారేపల్లి: కారేపల్లి పోలీసు స్టేషన్ రెండో ఎస్సైగా కోట కోడెత్రాచు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నేలకొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఎఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న కోడెత్రాచు పదోన్నతిపై కారేపల్లికి బదిలీ అయ్యారు. అదే విధంగా ఆయనకు గతంలో కారేపల్లి స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది.

ఆర్డీఓకు వినతి

కల్లూరు: నూతనం ఏర్పాటు చేసిన కల్లూరు మున్సిపాలిటీలో వార్డులను అసంబద్ధంగా విభజించడాన్ని నిరసిస్తూ.. బీజేపీ ఆధ్వర్యంలో ఆర్డీఓ రాజేందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. గతంలో స్వయం పరిపాలిత జీపీలుగా ఉన్న వాటిని విచ్ఛిన్నం చేసి అభివృద్ధి, ఉనికి కోల్పోయేలా చేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ శాస్త్రీయంగా ఆయా గ్రామ పంచాయతీలను ప్రత్యేక వార్డులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పుల్లయ్యబంజర్ బీజేపీ నాయకులు సుబ్బారావు, చారి, పుల్లారావు, అనీల్, , టి పుల్లారావు, జాలా అప్పారావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ లైట్లకు మరమ్మతులు

కారేపల్లి: మండలంలోని ఎర్రబోడు అటవీ ప్రాంతంలోని ఊటవాగు గ్రామంలో నివసిస్తున్న ఆదివాసీలకు అప్పట్లో కారేపల్లి ఎస్సైగా పనిచేసిన రామారావు.. కొత్తగూడెం సింగరేణి జీఎం షాలేమ్‌రాజు సహకారంతో సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల అవి మరమ్మతులకు నోచుకోగా.. ప్రస్తుతం వైరా ఎస్సైగా పనిచేస్తున్న ఆయన కొత్త బ్యాటరీ, ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేయించి గ్రామానికి కొత్త వెలుగులు నింపారు. దీంతో ఎస్సైను గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

నాయీ బ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలి


సంఘం మండల అధ్యక్షుడు నరసింహారావును సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: నాయీ బ్రాహ్మణులు నేటి సమాజంలో విద్య, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎదగాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ నంద్యాల నరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరులో నిర్వహించిన నాయీ బ్రాహ్మణుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం మండల కమిటీ ఎన్నిక నిర్వహించగా.. అధ్యక్షుడిగా కుదురుపాక రామ నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా ఉప్పెర్ల పోమయ్య, ఉపాధ్యక్షులుగా సైదులు, నరసింహారావు, సహాయ కార్యదర్శిగా నరసింహారావు, కోశాధికారిగా వెంకటరాజు, గౌరవ అధ్యక్షులుగా బాలాజీ, కృష్ణయ్య, గౌరవ సలహదారులుగా శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోకన్వీనర్ శ్రీనివాస్, వైరా పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయండి


సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి


మధిర: ర్యాలీలో ఎంఈఓ ప్రభాకర్, ఉపాధ్యాయులు

మధిర/ముదిగొండ/సత్తుపల్లిరూరల్/కొణిజర్ల: చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఎంఈఓలు ప్రభాకర్, డి.అబ్రహం తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి మండలంలోని రుద్రాక్షపల్లి గ్రామంలో, మధిర పట్టణంలో, మండలంలోని తనికెళ్లలో, ముదిగొండలో వారు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిఈడు పిల్లల గృహాలను సందర్శించి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమాలల్లో హౌసింగ్ ఆఫీసర్ పవన్, తనికెళ్ల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డి.శ్రీనివాస్, రుద్రాక్షపల్లి, కొమ్ముగూడెం, తనికెళ్ల కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి..


కొణిజర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులు

సత్తుపల్లిటౌన్/కల్లూరురూరల్/కొణిజర్ల: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి పౌష్టికాహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్య అందించబడుతుందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని రాజీవ్ నగర్, గౌరిగూడెం, తుంబూరు ప్రాంతాల్లో, కల్లూరులో, కొణిజర్లలో అమ్మమాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ యం.ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు ఆర్.శారద, డి.ఉమారాణి, కృష్ణవేణి, బి.ఉమారాణి, రాంబాయి, రుక్మిణి, శ్రీలక్ష్మి, మరియమ్మ, పద్మ, మాధవి, జయమ్మ పాల్గొన్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త భరత్

ఎర్రుపాలెం: రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి నేలతల్లిని కాపాడాలని మధిర వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త భరత్ అన్నారు. శుక్రవారం బనిగండ్లపాడులోని రైతువేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మరో శాస్త్రవేత్త నాగ స్వాతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయాలని, వరికొయ్యల్ని కాల్చకుండా భూమిలో కలియదున్నాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పురుగుమందులను సిఫార్సు చేసిన మేరకే వాడాలని సూచించారు. మిర్చి, పత్తిలో లింగాకర్షణ బుట్టలు ,పసుపు రంగు, నీలిరంగు అట్టలు పెట్టుకోవడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ సదస్సులో సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, ఏఈవోలు సింధూర్, బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


సత్తుపల్లి: మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి/చింతకాని: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ నంబూరి రామలింగేశ్వరరావు పిలుపునిచ్చారు. సత్తుపల్లిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా చింతకాని మండలంలోని మత్కేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా నాయకుడు మందడుపు సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడి 11 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభకాంక్షలు తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు బానోత్ విజయ్, ఆచంట నాగస్వామి, షేక్ రహీంతుల్లా, మంగా శివయాదవ్, సుబ్రమణ్యం, వంశీకృష్ణ, కార్తీక్, శేషగిరిరావు, విజయరెడ్డి, శివసాయి, వసంతరావు, వంశీ, చింతకానిలో.. బీజేపీ మండల అధ్యక్షుడు గోపి, మండల ప్రధాన కార్యదర్శి మంగయ్య, ఉపాధ్యక్షుడు కృష్ణ, హేమంత్, బూత్ అధ్యక్షుడు కృష్ణారావు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మట్టా దయానంద్, తదితరులు

సత్తుపల్లి: ఈ నెల 9వ తేదీన రఘునాధపాలెంలో తెలంగాణ గౌడ సంఘం కన్వెన్షన్‌హాల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం సత్తుపల్లిలో గౌడసంఘ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, నెహ్రూ, లింగయ్య, శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, చక్రవర్తి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైవే అండర్ పాస్ ఎత్తు పెంచాలి


నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి మీదుగా నిర్మించే నాగపూర్ అమరావతి నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా అండర్ పాస్ నిర్మాణం ఎత్తు పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రైతులతో కలిసి నిరసన చేపట్టారు. నేషనల్ హైవే అధికారులు అండర్‌పాస్ నిర్మాణం 5మీటర్ల నిర్మించాల్సినప్పటికీ 3.5మీటర్ల ఎత్తులో మాత్రమే పనులు చేపడుతున్నారన్నారు. విషయాన్ని అధికారులకు తెలిపినా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎత్తు పెంచకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, కృష్ణయ్య, రమేష్, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.